క్లుప్తంగా

సెలవులో వెళ్లిన ఏడీఏ

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ కర్నూలు సహాయ సంచాలకులు ఎస్.సాలురెడ్డి సెలవుల్లో వెళ్లారు. విదేశాలకు వెళ్లేందుకు అనుమతి కోసం ఈయన కొద్ది రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు ప్రభుత్వం అనుమతించింది. సెప్టెంబరు 30వ తేదీ వరకు ఆయన విదేశీ పర్యటనలో ఉంటారు. ఈ స్థానంలో కార్యాలయ టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న దస్తగిరిరెడ్డిని తాత్కాలికంగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ఈ మేరకు వ్యవసా య శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

కర్నూలు (టౌన్): మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో స్పార్క్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంటులో 588 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్విస్ లీగ్ పద్ధతిలో మొత్తం 8 రౌండ్ల పోటీలు నిర్వహించారు. విజేతలకు రూ.20 వేల నగదు బహుమతులు అందజేశారు. టోర్నీ డైరెక్టర్ స్వాతి, చీఫ్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్‌నాయుడు, ఆర్గనైజర్ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో సత్తా



వెండి పతకం అందుకుంటున్న కోలా ప్రతాప్

కర్నూలు (టౌన్): మైసూరులో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించిన ఆలిండియా షిటోరియో కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన ఆంధ్రప్రదేశ్ కరాటే సంఘం అధ్యక్షుడు కోలా ప్రతాప్‌కుమార్ వెండి పతకం సాధించారు. వెటరన్ కేటగిరీలో పాల్గొన్న ఆయన కటాస్ విభాగంలో ప్రతిభ చాటి ఈ ఏడాది డిసెంబర్‌లో సింగపూర్‌లో నిర్వహించనున్న ఏషియా పసిఫిక్ షిటోరియో కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

కర్నూలు సిటీ: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ డిమాండ్ చేశా రు. కర్నూలు అర్బన్‌లోని మునగాలపాడు గ్రామంలో ఆదివారం ఏపీ రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేదావతి, ఆర్డీఎస్ కుడి కాలువ పనులు పూర్తి చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రైతులకు రుణమాఫీ చేయాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తో పాటు, ఎరువులను 90 శాతం సబ్సిడీపై అందించాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో ప్రేమ వివాహం

కర్నూలు(సెంట్రల్): కేవీపీఎస్ ఆధ్వర్యంలో కార్మిక కర్షక భవన్‌లో ప్రేమ వివాహం జరిగింది. దళిత సామాజిక వర్గానికి చెందిన ఆర్.సుంకన్న, ముస్లిం మైనార్టీకి చెందిన ఎస్.కరిష్మ ఒక్కటయ్యారు. ఈ వివాహానికి యువతీ తల్లిదండ్రులు, యువకుడి తండ్రి హాజరవ్వగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆనందబాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ వారితో పూలదండలు మార్పించి ప్రమాణపత్రాలు చదివించారు. కొత్త దంపతులకు అంబేడ్కర్ చిత్రపటాన్ని బహుమతిగా ఇచ్చారు.

సదుపాయాలు కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని గోకారి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.భాస్కర్ మంత్రి టీజీ భరత్‌ను విన్నవించారు. కాలనీలో నీరు నిలిచి తీవ్ర అసౌకర్యంగా మారిందన్నారు. డ్రైయినేజీలు నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

బాలుడిపై పోక్సో కేసు

కర్నూలు (టౌన్): స్థానిక బుధవారపేటకు చెందిన 14 ఏళ్ల బాలుడిపై సోమవారం పోక్సో కేసు నమోదైంది. ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే గాకుండా ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారయత్నం చేశాడు. భయాందోళనకు గురైన బాలిక గట్టిగా కేకలు వేయగా చుట్టు ప్రక్కల వారు రావడంతో బాలుడు పారిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

చోరీ కేసు నమోదు

నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసు నమోదైంది. వివరాలు.. స్థానిక కొత్తబస్టాండ్ వెనుక ఉన్న దేవి అపార్ట్‌మెంట్స్‌లో రిటైర్డ్ ఉద్యోగి భవాని ప్రసాద్ నివసిస్తున్నారు. ఈ ప్లాట్‌లో కప్‌బోర్డు, మరమ్మతు పనులు చేపట్టేందుకు గత మే నెలలో కర్నూలుకు చెందిన ఇద్దరికి పనులు అప్పగించారు. అప్పట్లో వారు కప్‌బోర్డులో ఉన్న రూ.8 లక్షలు తీసుకుని ఉడాయించారు. ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు సోమవారం నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఎస్పీని కలిసిన మేయర్



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): కర్నూలు నగర మేయర్ బీవై.రామయ్య సోమవారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను కలిశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు మేయర్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ప్రాణం పోసే వైద్యులకు రక్షణ కల్పించలేరా?



నేను 1980 నుంచి బోధనాసుపత్రిలో నైట్‌డ్యూటీలు చేశాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు వైద్యుల పరిస్థితిలో ఏ మార్పు లేదు. వారికి రెస్ట్‌రూమ్స్, వాష్‌రూమ్స్, సెక్యూరిటీ, సరైన లైటింగ్స్ ఉండటం లేదు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇన్ని సమస్యలు లేవు. కోల్‌కతాలో జరిగిన ఘటన వల్ల మళ్లీ ఈ సమస్యలపై మాట్లాడుతున్నారు. కొన్నాళ్లకు మళ్లీ అన్నీ మరిచిపోయి ఎవరి పనుల్లో వారుంటారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలి. మెడికల్ కాలేజీలు, టెరిటరీ కేర్ సెంటర్లలో పోలీస్ భద్రతను పెంచాలి. సీఆర్‌పీఎఫ్, సెంట్రల్ ఫోర్స్, ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ వంటి వాటితో ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. పీజీ వైద్యులు రోగులకు ప్రాణం పోయగలరు గానీ, వారి ప్రాణాలు పణంగా పెట్టలేరు కదా. వారు లేవనెత్తిన అంశాలన్నీ సరైనవే. వారికి అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు తక్షణమే కల్పించాలి.

–డాక్టర్ బి.శంకరశర్మ, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు



అధిక పని గంటలతో ఒత్తిడి



ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో పీజీలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వర్కింగ్ అవర్స్ ఎక్కువగా ఉంటున్నాయి. ఒక్కోసారి వారు నిరంతరంగా 24 గంటల నుంచి 36 గంటల దాకా పనిచేస్తూనే ఉంటారు. దీనివల్ల వారిలో తీవ్ర మానసిక ఒత్తిడి పెరుగుతుంది. మరోవైపు రోగి మరణిస్తే వారి కుటుంబసభ్యులు భావోద్వేగంతో దాడి చేస్తుంటారు. ఇలాంటి సమయంలో పోలీసు ప్రొటెక్షన్ ఉంటే దాడులు జరగకుండా ఉంటాయి. దాడికి పాల్పడిన వారికి సరైన శిక్ష అమలు చేయాలి. దీనివల్ల వైద్యులకు ధైర్యం, మానసిక స్థైర్యం కలుగుతుంది. వారు ధైర్యంగా పనిచేయడంతో పాటు వారిలోని నైపుణ్యాన్ని ఉపయోగించి రోగులకు ప్రాణదానం చేయగలుగుతారు. అమెరికాలో ప్రతి ఆసుపత్రిలో పోలీస్ ప్రొటెక్షన్ ఉంటుంది. అక్కడ ఎవరైనా మరణిస్తే దాడులు జరగవు. ఇక్కడ గుంపులుగా గుంపులుగా చూడటానికి వస్తారు. ఎవ్వరినీ ఏమీ అనలేని పరిస్థితి ఉంటుంది. ఆసుపత్రిలో సౌకర్యాలు మరింత మెరుగుపడాల్సి ఉంది.

–డాక్టర్ పి.సుధాకర్‌రావు, సీనియర్ కంటి వైద్యులు, కర్నూలు



గోవర్ధనధారి వద్ద భక్తుల సందడి



రుక్మిణీ సమేత శ్రీకృష్ణ ఆలయం వద్ద పూజల్లో కమిటీ సభ్యులు





చిన్ని కృష్ణులు గోపికల వేషధారణ చిన్నారులతో చిన్మయ మిషన్ బాధ్యులు సుప్రేమానంద,ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కృష్ణం వందే జగద్గురుం

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- ప్రత్యేక ఆకర్షణగా చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



ప్రత్యేక అలంకరణలో రాధాగోవిందులు



సూర్యనారాయణ స్వామి ఆలయంలో చిన్ని కృష్ణుడు



విజ్ఞాన మందిరంలో ప్రత్యేక అలంకారణలో పార్థసారథి

కర్నూలు కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం జిల్లావ్యాప్తంగా వైభవంగా జరిగాయి. ఆలయాల్లో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. గోమాత పూజ, ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్ని కృష్ణులు, గోపికల చిలిపి చేష్టలు, నృత్యాలు అలరించాయి. ఇస్కాన్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ పాల్గొని పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిచ్చారు. నగరంలోని గో సంరక్షణ శాల, బీక్యాంప్ విజ్ఞాన మందిరం, లలితా పీఠం, చిన్న అమ్మవారి శాల, రామిరెడ్డి తాత సంస్థాన్, సత్యసాయి మందిరం, దక్షిణ షిరిడీ సాయిబాబా ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆ లయం, సత్యనారాయణ స్వామి ఆలయం, భరతమాత ఆలయాల్లో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

- ఇస్కాన్ జగన్నాథ మందిరంలో గోకులాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. శుభమంగళ హారతి, దర్శన హారతి, శ్రీమద్భాగవత ప్రవచనం, హరినామ సంకీర్తన, తులసి హారతి, గౌర హారతి, శ్రీరాధా గోవిందులకు మహా శంఖాభిషేకం, 108 ఆహార పదార్థాలతో రాజభోగ నివేదన కార్యక్రమాలు జరిగాయి. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక ప్రభు, భక్తులు పాల్గొన్నారు.

రుక్మిణీ సమేత శ్రీకృష్ణ మందిరంలో వేడుకలు

నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని రుక్మిణీ సమేత శ్రీ కృష్ణ మందిరంలో లాలిపాటలు, ఉట్లోత్సవం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి శ్రీకృష్ణ మందిరం వరకు ఊరేగింపు నిర్వహించా రు.చిన్నారుల కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

- భరతమాత మాతృ మండలి ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో విద్యార్థులకు నృత్య పోటీలు, బాలగోకులం, చిన్నికృష్ణులు, గోపికల వేషధారణ పోటీలు నిర్వహిహించారు. గోపికలు, చిన్ని కృష్ణుల వేషధారణ చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.
- చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళి భవన్‌లో చిన్నారులకు చిన్నికృష్ణుల పోటీలు నిర్వహించారు. మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సందేశమిచ్చారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ చిన్మయ మిషన్ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందజేశారు.



వేడుకలకు హాజరైన ప్రజలు



మాంటిస్సోరిలో చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు



రవీంద్ర స్కూల్‌లో చిన్నారులతో కరెస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య



ఉట్టి కొట్టేందుకు పోటీ పడుతున్న చిన్నారులు

చనిపోయిన బిడ్డను తిరిగిచ్చారని ధర్నా



మృతి చెందిన కావేరి

కర్నూలు(హాస్పిటల్): హాస్పిటల్ యాజమాన్యం చనిపోయిన బిడ్డను తమ చేతికి ఇచ్చారని ఆరోపిస్తూ నగరంలోని కిమ్స్ ఆస్పత్రి వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వారు తెలిపిన మేరకు వివరాలు.. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం చింతలపల్లి గ్రామానికి పెద్దక్క, పెద్దరాజు కుమార్తె కావేరి (6)కి డెంగీ జ్వరం రావడంతో ఈ నెల 23న చికిత్స నిమిత్తం కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో చేర్చారు. ఆదివారం వరకు చికిత్స కోసం రూ.4 లక్షల వరకు చెల్లించారు. సోమవారం ఉదయం మరికొంత డబ్బు చెల్లించాలని ఆసుపత్రి యాజమాన్యం చెప్పింది. ఇప్పటికే రూ.4 లక్షలు చెల్లించామని, ఇక తమ వద్ద డబ్బు లేదని, సమయం కావాలని కోరగా, డబ్బులు లేకపోతే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఆసుపత్రి యాజమాన్యం సూచించింది. ఈ మేరకు కావేరిని అంబూ బ్యాగ్‌తో కుటుంబసభ్యులకు అందజేశారు. కొద్దిసేపటికే పాప మరణించడంతో చనిపోయిన బిడ్డను తమ చేతికి ఇచ్చారని వారు ఆందోళనకు దిగారు. ఆసుపత్రి వద్ద ధర్నా చేయడంతో పోలీసులు వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయమై ఆసుపత్రి సీఈఓ డాక్టర్ సునీల్ వివరణ ఇస్తూ.. కావేరికి తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చారని, బతికి ఉండగానే పాపను కుటుంబసభ్యులకు ఇచ్చామన్నారు. ఆక్సిజన్ తీసేసి నాలుగు రోజుల క్రితమే పాప చనిపోయిందని తమపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. చికిత్సకు రూ.2.84 లక్షలు మాత్రమే చెల్లించారని, పేదవారని చెబితే రూ.2 లక్షలు వెనక్కి ఇచ్చామని వివరించారు.

రేపు వీహెచ్‌పీ కేంద్రీయ మహామంత్రి రాక

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ మహా మంత్రి (ప్రధాన కార్యదర్శి) భజరంగ్ లాల్ భాఘ్డా ఈనెల 28న కర్నూలుకు వస్తున్నట్లు వీహెచ్‌పీ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నందిరెడ్డి సాయిరెడ్డి, కాకర్ల రాముడు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయ ప్రాంగణంలో వీహెచ్‌పీ కార్యాలయం పైఅంతస్తును సాయంత్రం 4 గంటలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం భరతమాత మందిర ప్రాంగణంలో సభ ఉంటుందని తెలిపారు.



పెద్దాసుపత్రిలో చెట్ల కొమ్మలను నరికేసిన దృశ్యం

• పచ్చదనంపై గొడ్డలి వేటు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీలలో సోమవారం చెట్ల కొమ్మలను ఇష్టానుసారంగా నరికివేశారు. ప్రైవేటు వ్యక్తులు వచ్చి శుశృత భవన్ నుంచి మెడికల్ కాలేజీకి వెళ్లే దారి తో పాటు మెడికల్ కాలేజీలోని పలు చెట్ల కొమ్మలను నరికివేశారు. వీటిలో కొన్ని మాత్రమే వి ద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్నాయి. అయితే ఎలాంటి అడ్డం లేకపోయినా లావుగా ఉన్న మొద్దుల కోసమే ఇష్టారీతిన నరికివేసినట్లు కనిపిస్తోంది. అధికారులు, ఉద్యోగులు ఎవ్వరూ లేకపోవడంతో కొమ్మలను తొలగించి మొద్దులను తీసుకెళ్లిపోయారు. నీడనిచ్చే చెట్లను ఇష్టారీతిన నరికివేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– కర్నూలు(హాస్పిటల్)

ఐఏఎస్‌లతో ఆటలు

- కర్నూలు కార్పొరేషన్‌లో బదిలీలలు'
- 17న ఐఏఎస్ అధికారికి పోస్టింగ్, 25న చిత్తూరు జేసీగా బదిలీ
- వారం రోజుల వ్యవధిలో ఉత్తర్వుల జారీ
- టీడీపీ నేతల ఒత్తిళ్లే కారణమా?
- నాన్ ఐఏఎస్ నియమాకానికి లైన్ క్లియర్
- నేడో, రేపో కమిషనర్‌గా రవీంద్రబాబుకు ఉత్తర్వులు



కర్నూలు (టౌన్): కర్నూలు కార్పొరేషన్‌లో బదిలీలు ప్రహసనంగా మారాయి. గతంలో ఏన్నడూ లేని విధంగా బదిలీల ప్రక్రియ జరుగుతోంది. ఇష్టానుసారంగా మార్పులు చేర్పులు చేస్తున్నారు. మూడు నెలలు కూడా పూర్తి కాని ఈ ప్రభుత్వంలో నేతల ఒత్తిళ్లతో బదిలీల ప్రక్రియ సాగుతోంది. ఇక ఐఏఎస్‌లను సైతం ఇష్టానుసారంగా మారుస్తున్న వైనం ప్రస్తుత ప్రభుత్వంలో స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. పోస్టింగ్ వేస్తున్నారు. నేతల ఒత్తిళ్లు రావడంతో ఐఏఎస్‌లను సైతం మారుస్తున్నారు. ఈ వింత పరిస్థితి కర్నూలు కార్పొరేషన్‌లో నెలకొంది. ఇలా ఏవరు పడితే వారు చెబితే ఐఏఎస్‌లను మార్చడం ఇదే తొలిసారి అని కార్పొరేషన్ అధికారులు పేర్కొంటున్నారు.

17న పోస్టింగ్, 25న బదిలీ

కర్నూలు కార్పొరేషన్‌లో కమిషనర్లుగా ఐఏఎస్‌లు కొనసాగుతున్నారు. గత ప్రభుత్వంలోను ఐఏఎస్‌లు పనిచేశారు. తాజాగా ప్రభుత్వం మారిన తరువాత కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి భార్గవ్‌తేజను గత నెల 23న గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసింది. అప్పటినుంచి అదనపు కమిషనర్‌గా ఉన్న రామలింగేశ్వర్‌ను ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించింది. తరువాత ఫుల్ ఆడిషనల్ చార్జ్ బాధ్యతలు అప్పగించింది. ఆయనే కొనసాగుతారనుకుంటున్న సమయంలో ఈనెల 17న నెల్లూరు జిల్లా కందుకూరు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న యువ ఐఏఎస్ అధికారి విద్యాధరిని కర్నూలు కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక సమస్య క్లియర్ అయ్యింది. బాధ్యతలు చేపట్టడమే తరువాయి అనుకుంటున్న సమయంలో సరిగ్గా వారం రోజుల తరువాత ఈనెల 25న యువ ఐఏఎస్ అధికారి విద్యాధరిని కర్నూలులో బాధ్యతలు చేపట్టక ముందే చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఇలా ఎవరు వస్తారో? ఎవరు పనిచేస్తారో? అన్న గందరగోళం నెలకొంది. రాజమండ్రి, తిరుపతి కార్పొరేషన్లకు రాని సమస్య ఒక్క కర్నూలుకే ఎందుకు వస్తుంది. ఎవరి నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. నేతల ఒత్తిళ్లే గందరగోళానికి కారణమా? అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాన్ ఐఏఎస్ అధికారికి లైన్ క్లియర్

పనిచేస్తున్న ఐఏఎస్‌లను బదిలీ చేశారు. మళ్లీ యువ ఐఏఎస్‌ను నియమించారు. ఇప్పుడు మళ్లీ బదిలీ చేశారు. ఇప్పుడు తాజాగా నాన్ ఐఏఎస్ వైపు స్థానిక నేతలు ఒత్తిళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగా మున్సిపల్ డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న రవీంద్రబాబు పేరు వినిపించడమే గాకుండా ఖరారు చేసినట్లు సమాచారం. కర్నూలు కమిషనర్‌గా రవీంద్రబాబు 2015 జూన్ 1 నుంచి 2017 మే 1 వరకు రెండేళ్లు పనిచేశారు. అలాగే 2019 జులై 14 నుంచి 2020 ఏప్రిల్ 30 వరకు ఇక్కడే పనిచేశారు. గతంలో రెండుసార్లు పనిచేసిన రవీంద్రబాబును కమిషనర్‌గా కొనసాగించేందుకు టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం రెండు రోజుల్లో రవీంద్రబాబును కర్నూలు కమిషనర్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయని కార్పొరేషన్ వర్గాలు వెల్లడించాయి.

సిఫార్సు లేఖల కోసం మంత్రి వద్దకు క్యూ కట్టిన ఇంజినీర్లు

కర్నూలు నగరపాలక సంస్థలో ద్వితీయ శ్రేణి అధికారి సిఫార్సు లేఖల ద్వారా కూడా, అనంతపురం, కడప కార్పొరేషన్‌లకు బదిలీ చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. తాజాగా తిరుపతికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఇక పలువురు ఇంజినీర్లు కర్నూలు మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి సిఫార్సు లేఖలతో ప్రభుత్వానికి విన్నపాలు చేశారు. మంత్రి వద్దకు ఇంజినీర్లు క్యూ కడుతున్నారు. ఇవే లేఖలతో నంద్యాల మున్సిపాలిటీకి, తిరుపతి మున్సిపాలిటీకి విన్నవించుకోగా మరికొంత మంది ఇంజినీర్లు కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాలు చూపుతూ లేఖలు సమర్పించారు. ఏడాదిన్నరలో రిటైర్డు అవుతున్నానని లేఖతో పాటు ఇక్కడే కొనసాగించాలని ముఖ్య ఇంజినీర్ కోరుతున్నారు. ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టనుంది.

కనీస వేతనాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ శాఖలో పనిచేసే మీటర్ రీడింగ్ కార్మికులకు కనీస వేతనాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవా లని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం స లాం ఖాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన కర్నూలు డివిజన్ మీటర్ రీడింగ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు రోజుల్లో 1500 నుంచి 2వేల ఇళ్ల బిల్లుల ను రీడింగ్ తీయాలంటే ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి ఉంటోందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన మేరకు ఎక్స్‌ట్రా అకౌంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక :కర్నూలు డివిజన్ మీటర్ రీడింగ్ ఉద్యోగుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జి.చంద్రశేఖర్, అధ్యక్షుడు లతీఫ్, ఉపాధ్యక్షులుగా ఎస్.రాముడు, అయ్యస్వామి, ప్రధాన కార్యదర్శులుగా హుస్సేన్, షఫీ, ట్రెజరర్‌గా హమీద్‌లను ఎన్నుకున్నారు.

బీఓబీ శాఖ తరలింపు

కర్నూలు(అగ్రికల్చర్): గూడూరు మండలం పెంచికలపాడులోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) శాఖను నూతన ప్రాంగణంలోకి మార్పు చేస్తున్నట్లుగా బ్రాంచ్ మేనేజర్ బి.రమేష్‌బాబు తెలిపారు. విశ్వభారతి మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న రాహుల్ ఇంద్రప్రస్థ నగర్‌లోని ప్లాట్ నెంబర్–1లోకి మార్పు చేస్తున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన భవనం ప్రారంభోత్సవ మంగళవారం ఉంటుందని వెల్లడించారు.